TELTEL/2023/88710

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU






ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

www.telanganamuchatlu.in

వరంగల్ సంపుటి : 3 సంచిక : 245 సోమవారం 2 - 2 - 2026 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in

### బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా

## మన అభ్యర్థులు ఉండాలి: రేవంత్ రెడ్డి



అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచన బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ జూమ్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అన్నారు. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే అన్నారు. రెబల్స్ విషయంలో మాట్లాడి స్వయంగా సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

### మీ ఆదేశాలతోనే

## ఫోన్ ట్యాపింగ్ జరిగిందా?



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును సిట్ అధికారులు ఆదివారం హైదరాబాద్ నందినగర్‌లోని కెసిఆర్ నివాసంలో నాలుగున్నర గంటలపాటు విచారించారు. ఇంటి వెలుపల వేలాది మంది కార్యకర్తల నిరసనలు, నినాదాలు ఒకపక్క సాగుతుండగా, ఆరుగురు సిట్ అధికారులు మాజీ సిఎంను ప్రశ్నించారు. సిట్ అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు నేరుగా సమాధానమిచ్చిన కెసిఆర్... మరికొన్నిటికి ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం. 'ఇదంతా సిల్లీ వ్యవహారం. కేవలం రాజకీయ కక్షతోనే సాగిస్తున్న డ్రామా' అని ఆయన అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సిట్ ఇచ్చిన నోటీసుల మేరకు కెసిఆర్ ఆదివారం భారీ కాన్వారుతో ఎర్రవల్లి ఫాం హౌస్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో నందినగర్ నివాసానికి చేరుకున్నారు. సిట్ అధికారులు కూడా అదే సమయానికి అక్కడకు వచ్చారు. ఇతరులెవరూ అటువైపు రాకుండా కెసిఆర్ నివాస పరిసరాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగర స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజరుకుమార్, మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి, గ్రేహౌండ్స్ కమాండెంట్ రవీందర్ రెడ్డి, కూకట్‌పల్లి డిసిపి రితురాజ్, శంషాబాద్ అదనపు ఎస్‌పి ఎఎస్ రావు, ఎసిపిలు శ్రీధర్, వెంకటగిరి మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో విచారణ ప్రారంభించారు. విచారణ గదిలోకి న్యాయవాదులను అనుమతించలేదు. విచారణ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్నట్టు మీకు ముందుగానే తెలుసా? మీకు అవసరమైన వ్యక్తుల సమాచారం కోసం వారి ఫోన్లు ట్యాపింగ్ చేయమని అప్పటి ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్‌రావును ఆదేశించారా? ఈ విషయంలో అప్పటి టాస్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌రావును కూడా ఉపయోగించుకున్నారా? అనే ప్రశ్నలతో విచారణను అధికారులు ప్రారంభించినట్టు తెలిసింది. ఇంటెలిజెన్స్ అధికారులు సిఎంగా ఉన్న తనను ప్రతిరోజూ ఉదయాన్నే కలిసి శాంతిభద్రతల సమాచారం చెప్పేవారని, ఆ సమాచారం ఎలా సేకరించారనే విషయం తనకు అప్రస్తుతమని కెసిఆర్ సమాధానం చెప్పినట్టు సమాచారం. 'దేశ భద్రత, ప్రభుత్వ సుస్థిరత, మావోయిస్టుల కదలికలపై ఇంటెలిజెన్స్ అధికారులు ఫోన్ ట్యాపింగ్ చేస్తుంటారు. అది వారి విధుల్లో భాగమని మీకు తెలియదా?' అని సిట్ అధికారులను కెసిఆర్ ఎదురు ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ కేసులో తాము అరెస్ట్ చేసి విచారించిన అధికారులు కొందరు 'సుప్రీం' నుంచి వచ్చిన ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గతంలో తెలిపిన విషయాన్ని సిట్ అధికారులు ప్రస్తావిస్తూ, 'ఆ సుప్రీం మీరేనా?' అని ప్రశ్నించినట్లు సమాచారం. కెసిఆర్ నేరుగా సమాధానం ఇవ్వలేదని తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భద్రతా చర్యల్లో భాగంగా సాధారణంగా నిర్వహించే వ్యవహారమని కెసిఆర్ వాదించినట్టు సమాచారం. గతంలో తాము సేకరించిన సమాచారాన్ని, పలు ఆధారాలను కెసిఆర్ ముందుపెట్టి సిట్ అధికారులు ప్రశ్నించారు. మధ్యలో విరామమిస్తూ రాత్రి 7.45 గంటల ప్రాంతంలో విచారణ ముగించి స్టేట్‌మెంట్‌పై కెసిఆర్ సంతకం తీసుకున్నట్టు తెలిసింది. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో సిట్ అధికారులు కెసిఆర్ నివాసం నుంచి వెళ్లిపోయారు. కిందికి వచ్చిన కెసిఆర్... అక్కడే ఉన్న కెటిఆర్, హరీశ్‌రావులతో సమావేశమయ్యారు.

## వాణిజ్య గ్యాస్ ధర రూ.50 పెంపు



న్యూఢిల్లీ : బడ్జెట్ రోజునే కేంద్రం ప్రజలకు షాకిచ్చింది. దేశవ్యాప్తంగా 19 కిలోల వాణిజ్య వంట గ్యాస్ (ఎల్‌పిజి) సిలిండర్ ధరలను రూ.50 వరకూ చమురు సంస్థలు పెంచి ఆదివారం అమలులోకి తీసుకొచ్చాయి. తాజా ధరల పెంపుతో చిన్న హోటళ్లు, దుకాణాలు, వినియోగదారులపై ప్రభావం పడనున్నది. విశాఖలో రూ.1747 నుంచి రూ.1794కు, కర్నూలులో రూ.1875 నుంచి రూ.1925కి పెరిగింది. చెన్నైలో సిలిండర్ ధర రూ.50 పెరగగా.. కోల్‌కతా, ముంబయి నగరాల్లో రూ.49.50 చొప్పున, హైదరాబాద్‌లో రూ.49 పెరిగింది. ఈ ధరల పెరుగుదలతో హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, మెస్‌లు, క్యాటరింగ్ సర్వీసులు, టీస్టాళ్లు, బేకరీలు, కేఫ్‌లు, హాస్టళ్లు, లాడ్జ్‌లు, చిన్న ఆహార -- ఆధారిత వ్యాపారాలపై ప్రత్యక్ష ప్రభావం పడనున్నది. చిన్న హోటళ్లు, దుకాణాల యజమానులకు తాజా నిర్ణయం భారం కానున్నది. ఈ పెంపుతో వినియోగదారుల జేబులకు చిల్లు పడనుంది.

## అమెరికాతో న్యాయమైన చర్చలకు సిద్ధమే!





వాషింగ్టన్, టెహరాన్, అంకారా : అమెరికాతో న్యాయమైన చర్చలకు సిద్ధమేనని ఇరాన్ ప్రకటించింది. సైనిక బెదిరింపుల వాతావరణంలో మాత్రం ఎలాంటి చర్చలకూ అంగీకరించేది లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి స్పష్టం చేశారు. ఇరాన్ క్షిపణి కార్యక్రమంపై ఎట్టి పరిస్థితు ల్లోనూ చర్చకు అవకాశం లేదని, అది తమ దేశ భద్రతకు సంబంధించిన వ్యవహారమని తేల్చి చెప్పారు. టర్కీ పర్యటనలో ఉన్న అరగ్చి, టర్కీ విదేశాంగ మంత్రి హాకాన్ ఫిదాన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు.

కుదరకపోతే సైనిక చర్య : ట్రంప్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్‌పై ఒత్తిడి పెంచుతున్నారు. "భారీ నౌకాదళాన్ని" ఇరాన్ వైపు పంపుతున్నామని ప్రకటించిన ట్రంప్ అవసరమైతే సైనిక చర్య కూడా చేపడతామని హెచ్చరించారు.

### కేసీఆర్ కు సిట్ నోటీసులపై

## కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ జారీ చేసిన నోటీసులపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. నందినగర్ లోని కేసీఆర్ నివాసం ముందు గోడకు నోటీసులు అతికించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. 'గోడకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందారు' అంటూ ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. సిట్ అధికారులకు కేసీఆర్ స్వయంగా తన చిరునామాను అందించారని కేటీఆర్ గుర్తుచేశారు. అయినప్పటికీ ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అంటించడం పైశాచిక చర్యేనని మండిపడ్డారు. ఇది అహంకారం కాకపోతే మరేమిటని ప్రశ్నించారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారు ఉంటున్న ఇంటికే వెళ్లి విచారించాలని నిబంధనలు చెబుతున్నాయని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా..లేక ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మల్లా మారి ప్రతిపక్ష నేతలను వేధించడమే పనిగా పెట్టుకున్నారా అంటూ పోలీసులను నిలదీశారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని కేటీఆర్ తెలిపారు.

**అసలేం జరిగిందంటే..**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తొలిసారి అందించిన నోటీసులకు కేసీఆర్ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించిన అధికారులు.. రెండోసారి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా నోటీసులు అందించేందుకు నందినగర్ లోని కేసీఆర్ ఇంటికి వెళ్లిన అధికారులు అక్కడ ఎవరూ లేకపోవడం, ఇంటికి తాళం వేసి ఉండడంతో గోడకు నోటీసులు అతికించి వెళ్లారు.

## డాక్టర్ నోరి దత్తాత్రేయుడికి మెగాస్టార్ చిరంజీవి ఆతిథ్యం



ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ నోరి దత్తాత్రేయుడితో మెగాస్టార్ చిరంజీవి భేటీ అయ్యారు. ఇటీవల పద్మభూషణ్ పురస్కారం అందుకున్న డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని చిరంజీవి తన నివాసానికి ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ భేటీపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తన సంతోషాన్ని పంచుకున్నారు. "అధునాతన కేన్సర్ చికిత్సలో అసాధారణమైన సేవలకు గాను 'పద్మభూషణ్' గౌరవం పొందిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడు గారికి ఆతిథ్యం ఇవ్వడం, ఆయనతో అద్భుతమైన క్షణాలను గడపడం గౌరవంగా భావిస్తున్నాను.

మల్లాపూర్‌లో స్వర్గీయ నెమలి సురేష్ 7వ వర్ధంతి వేడుకలు

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
అనునిత్యం ప్రజల పక్షం
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# సిట్ విచారణకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ భారీ బైక్ ర్యాలీ.

**- నల్ల బ్యాడ్జీలతో నిరసన.**

**- రేవంత్ రెడ్డి డౌన్‌డౌన్ నినాదాలతో దద్దరిల్లిన దమ్మపేట.**



అశ్వారావుపేట, ఫిబ్రవరి 1 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ జాతిపిత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఫోన్ ట్యాపింగ్ అక్రమ కేసులో సిట్ విచారణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు దమ్మపేట మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దమ్మపేట నుంచి మందలపల్లి వరకు సాగిన ఈ ర్యాలీకి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్ నాయకత్వం వహించారు. ర్యాలీ సందర్భంగా 'సీఎం రేవంత్ రెడ్డి డౌన్‌డౌన్' నినాదాలతో మండల కేంద్రం మారుమోగింది. గులాబీ జెండాలతో దమ్మపేట గులాబీమయంగా మారింది. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. తెలంగాణ కోసం పోరాడిన నాయకుడిపై అక్రమ కేసులు పెట్టడం సహించబోమని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రభుత్వాన్ని హామీల అమలుపై నిలదీస్తున్నారని, ఆ ప్రశ్నల నుంచి దృష్టి మళ్లించేందుకే కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కక్షపూరిత రాజకీయాలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కేసీఆర్ జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ర్యాలీలో వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, మాజీ సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరావు, నియోజకవర్గ నాయకులు సోయం వీరభద్రం, మండల ఉపాధ్యక్షుడు గాజుబోయిన యేసుబాబు, యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాసరావు, నాయకపోడు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే సర్పంచులు కొమరం సుశీల, యట్ల రామదాసు, ఉపసర్పంచ్ రామకృష్ణ, మహేష్, మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను, మండల నాయకులు జలగం వాసు, తుమ్మల లక్ష్మణరావు, సోయం రాజబాబు, అబ్దుల్ జిన్న, పాస్యం ప్రసాద్, సోడెం గంగరాజు, కృష్ణ, కోర్స వెంకటేశ్వరావు, మాజీ సర్పంచ్ ఉయ్యాల చిన్న వెంకటేశ్వరావు, నారాం రాజు, ఎస్సీ సెల్ నాయకుడు మద్దెల పుల్లారావు, కార్మిక సంఘం నాయకుడు గాజుబోయిన శ్రీనివాసరావు (ఆటో), కొలికపోగు ధర్మతో పాటు వార్డు సభ్యులు ఉయ్యాల లక్ష్మీనారాయణ, దారా రాము, రూప రాంబాబు, బండి ప్రసాద్, నాగయ్య, కాకా ప్రసాద్, శేషాద్రి, ముత్తు, సున్నం నరేంద్ర, వల్లెపు నాగేశ్వరావు, మడిపల్లి పోలయ్య, తోగర్త వెంకటేశ్వరావు, పిట్టల లాలు తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పల్‌లో పార్టీభేదాలు లేకుండా అభివృద్ధి పనులు రజితా పరమేశ్వర్‌రెడ్డి





ఉప్పల్, ఫిబ్రవరి 01 (తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీభేదాలకు అతీతంగా అభివృద్ధి జరుగుతోందని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యే లేదా ఎంపీ ఉన్న నియోజకవర్గాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యేవని, ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయని పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని, కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే గానీ, ఎంపీ గానీ ఉప్పల్‌కు లేకపోయినా, నియోజకవర్గానికి సంబంధించిన ఏ చిన్న సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే వెంటనే నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా సీఎం పని చేస్తున్నారని ఆమె అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి గల్లీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గతంలో ఎప్పుడూ లేనివిధంగా అభివృద్ధి పనుల జాతర కనిపిస్తోందని చెప్పారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. "పార్టీ ఏదైనా కావచ్చు, వారంతా నా ప్రజలే. ఈ తెలంగాణ బిడ్డలు, నగరవాసులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి, సంక్షేమ ఫలాలు అందాలి. రాజకీయాలు ఎన్నికల సమయంలో చేద్దాం, ఇప్పుడంతా అభివృద్ధి ఆలోచనే" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన భరోసా ఉప్పల్‌లో అమలవుతోందని రజితా పరమేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు.

# సత్తుపల్లి-కల్లూరు మున్సిపల్ ఎన్నికల సన్నాహక భేటీకి జనసంద్రోహం.

**- ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ.**






సత్తుపల్లి, ఫిబ్రవరి 1 (తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి పట్టణంలోని మాధురి ఫంక్షన్ హాల్‌లో సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ నేతృత్వంలో సమావేశం జరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. సర్వేల ఆధారంగా మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని నేతలు వెల్లడించారు. టిక్కెట్లు దక్కని కార్యకర్తలు నిరుత్సాహపడవద్దని, పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో వారికి బాధ్యతలు, పదవులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మున్సిపాలిటీల్లో ప్రతి గడపకూ తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలతో నేరుగా మమేకమై ప్రభుత్వ పథకాలను వివరించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సత్తుపల్లి మున్సిపాలిటీ నుంచి పోటీ చేస్తున్న 23 మంది, కల్లూరు మున్సిపాలిటీ నుంచి బరిలో ఉన్న 20 మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రజల మద్దతుతో భారీ విజయం సాధించి, రెండు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల అనంతరమే చైర్మన్ల ఎన్నిక జరుగుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# మల్లాపూర్‌లో స్వర్గీయ నెమలి సురేష్ 7వ వర్ధంతి వేడుకలు



మల్లాపూర్, ఫిబ్రవరి 01(తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్.వి.నగర్ కాలనీలో గల మాజీ కార్పొరేటర్ స్వర్గీయ నెమలి సురేష్ విగ్రహం వద్ద ఆయన 7వ వర్ధంతి కార్యక్రమాన్ని సూర్య చంద్ర యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెమలి సురేష్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో వక్తలు ఆయన ప్రజాసేవ, కాలనీల అభివృద్ధికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ప్రజల సమస్యలపై ఎప్పుడూ స్పందిస్తూ, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా నెమలి సురేష్ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి మల్లాపూర్, శక్తి సాయి నగర్, హెచ్.బి కాలనీ, ఏ.ఎస్.రావు నగర్ డివిజన్లకు చెందిన వివిధ సంఘాల నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నెమలి సురేష్ అభిమానులు, మల్లాపూర్ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ ప్రియతమ నాయకుడిని స్మరిస్తూ పూల నివాళులు అర్పించిన వారు, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని సంకల్పం వ్యక్తం చేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ప్రశాంతంగా ముగిసింది.



# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



శ్రీకాకుళం ఫిబ్రవరి 01(తెలంగాణ ముచ్చట్లు): రోడ్డు భద్రత అనేది కేవలం ఒక నెలకే పరిమితం కాకుండా సంవత్సరమంతా పాటించాల్సిన సామూహిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఉప రవాణా కమిషనర్ విజయ సారథి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, క్రమశిక్షణతో వాహనాలు నడపడం ద్వారానే ప్రమాదాల నివారణ సాధ్యమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని, సిబ్బంది కృషి అభినందనీయమని కొనియాడారు. మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పెదపాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఎస్. సోని (8వ తరగతి) ప్రథమ బహుమతి సాధించగా, బి. ధనలక్ష్మి (9వ తరగతి) ద్వితీయ, బి. హాసిని (9వ తరగతి) తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన రవాణా శాఖ అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక

# రోడ్డు ప్రమాదంలో పాన్ షాప్ వ్యాపారి మృతి

చర్లపల్లి, ఫిబ్రవరి 01 (తెలంగాణ ముచ్చట్లు): మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఫిర్యాదుదారు మొహమ్మద్ గౌస్ పటేల్ తెలిపిన వివరాల ప్రకారం, అతని తండ్రి మొహమ్మద్ జాఫర్ (55) వృత్తిరీత్యా పాన్ షాప్ వ్యాపారి. ఆదివారం మధ్యాహ్నం 1.40 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి కుషాయిగూడ డీ-మార్ట్‌కు వెళ్లేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో అశోక్ నగర్‌లోని తన పాన్ షాప్ వద్ద మొహమ్మద్ జాఫర్ తన మొబైల్ ఫోన్‌ను కుమారుడికి అప్పగించి రోడ్డును దాటుతుండగా, టీజీ08ఖీఎ2242 నంబర్ గల పల్సర్ మోటార్ సైకిల్‌ను అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడిపిన గుర్తుతెలియని వ్యక్తి ఆయనను ఢీకొట్టాడు. ప్రమాదంలో జాఫర్ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఈసీఐఎల్‌లోని జెనియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు పరీక్షించి ఆయన మరణించినట్లు ప్రకటించారు. ఈ ఘటనపై చర్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనం మరియు డ్రైవర్‌ను గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.



# 22వ వార్డులో ఎండి. రెహానా కమల్ పాషా విస్తృత ప్రచారం.



సత్తుపల్లి, ఫిబ్రవరి 1 (తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 22వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎండి. రెహానా కమల్ పాషా విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి వీధి, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజలతో నేరుగా మమేకమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో నెలకొన్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని, అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల ఆశీస్సులు, మద్దతుతో 22వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తైన హస్తం గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. కరోనా మహమ్మారి సమయంలో ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఆసుపత్రుల్లో చికిత్సకు తోడ్పడుతూ పలువురికి ప్రాణదాతగా నిలిచిన కమల్ పాషా, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. 22వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని వెల్లడించారు. బాల్యం నుంచి ఇదే వార్డులో కుటుంబ నేపథ్యం ఉండటం, వార్డు పరిస్థితులపై పూర్తి అవగాహన ఉండటం తమ బలమని రెహానా కమల్ పాషా పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కొంగల సాయిలు, పాశం వెంకటేశ్వరరావు, కళ్యాణ్, డి.ఎన్.చారి, రియాజ్, సాదిక్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దహనం - టీడీపీ నాయకుల నిరసన



ఏ.ఎస్.రావు నగర్, ఫిబ్రవరి 01 (తెలంగాణ ముచ్చట్లు) :ఉప్పల్ నియోజకవర్గం డా. ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ చౌరస్తా వద్ద శుక్రవారం తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేశారంటూ వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య రాజకీయాల్లో హద్దులు దాటిన వ్యాఖ్యలు అనుచితమని, ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నేతపై వ్యక్తిగత దూషణలు చేయడం ఖండనీయమని అన్నారు. అంబటి రాంబాబు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు, మాజీ కౌన్సిలర్ గడ్డమిధి రాములు యాదవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు మొవ్వ శ్రీనివాస కుమార్, సీనియర్ నేతలు బింగి బిక్షపతి, గొట్టిపాటి వెంకటేశ్వరావు, శేషు, గోబేరు రమేష్, రవి, చల్లపల్లి నాగేశ్వరావు, కృష్ణ గౌడ్, సత్యం యాదవ్, హరికృష్ణ, రాంబాబు, కోటేశ్వరరావు, హరనాథ్ బాబు, రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ ను సిట్ విచారణకు పిలవడం సిగ్గుచేటు.

## వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్.

హసన్ పర్తి,ఫిబ్రవరి 01(తెలంగాణ ముచ్చట్లు): ఫోన్ టాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కి సిట్ నోటీసులు జారీ విచారణకు పిలవడాన్ని వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున హసన్ పర్తి మండలం ఎర్రగట్టు గుట్ట వద్ద రాస్తారోకో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కు ఫోన్ టాపింగ్ అక్రమ కేసులో సిట్ నోటీసు ఇచ్చి విచారణకు పిలవడాన్ని తెలంగాణ రాష్ట్రమంతా గ్రామ గ్రామాన ఖండిస్తుందని అన్నారు. 14 సంవత్సరాలు ఉద్యమాలు చేసి తెలంగాణ తెచ్చిన నాయకుడు పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండి దేశంలోనే రాష్ట్రాన్ని నెంబర్ 1 ఉంచిన కెసిఆర్ ను సిట్ విచారణకు పిలవడం సిగ్గుచేటని రాష్ట్ర





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చలేక,సరియైన పరిపాలన చేయలేక డ్రామా సృష్టించి ప్రతి దానిపైన విచారణని రెండు సంవత్సరాలు కాలయాపన చేస్తూ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక బిఆర్ఎస్ పార్టీ నాయకుల్ని కేసుల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ కు ఇచ్చిన సిట్ నోటీసులు రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కాలం నుండి పాలన గాడిలో లేదని పేదవారు, మధ్యతరగతి,యువకులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగులు అందరూ కూడా ఆగమాగం అయితున్నారని కెసిఆర్ పైన,వారి కుటుంబం పైన, టిఆర్ఎస్ పార్టీ పైన కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజిని కుమార్, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు,జక్కు రమేష్,కొత్తకొండ సుభాష్,విక్టర్ బాబు,బండి రత్నాకర్ రెడ్డి,చిర్ర సుమన్, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# దర్యాప్తు ముసుగులో కేసీఆర్ పై రాజకీయ కక్ష సాధింపు

## - పెద్దమందడి మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి

పెద్దమందడి,ఫిబ్రవరి1(తెలంగాణ ముచ్చట్లు): పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో ఫోన్ టాపింగ్ కేసుకు సంబంధించి మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు (కెసిఆర్) సిట్ అధికారులు నోటీసులు జారీ చేసి విచారణకు ఆదేశించిన నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దర్యాప్తు పేరుతో రాజకీయ కక్షసాధింపునకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ పార్టీ నిరసనకు పిలుపునిచ్చింది. పార్టీ పిలుపుమేరకు వెల్టూర్ గ్రామంలో మాజీ జడ్పిటిసి రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, సిట్ చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ప్రజల కోసం ఉద్యమించి తెలంగాణ సాధించిన నాయకుడిపై కక్షపూరితంగా కేసులు బనాయిస్తున్నారని నేతలు విమర్శించారు. ఫోన్ టాపింగ్ కేసు పేరిట కేసీఆర్‌ను రాజకీయంగా



వేధించాలనే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో ప్రజాస్వామ్య స్వరాన్ని అణిచివేయలేరని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ప్రజల తరపున ప్రశ్నిస్తుండటాన్ని తట్టుకోలేకనే నోటీసులు జారీ చేశారని బిఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారు. రాజకీయ వేధింపులకు బిఆర్ఎస్ వెనక్కి తగ్గదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, గ్రామ అధ్యక్షులు మల్లక్ సురేష్, గ్రామ మాజీ రైతుబంధు అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు చిత్తూర్ కృష్ణారెడ్డి, ఖాజా హుస్సేన్, బుసయ్య, సాంబ యాదయ్య, వార్డు సభ్యులు యాదయ్య, వెంకటేష్, సుద్ద బాయ్ రాజు, రంజిత్ గౌడ్, శాంతయ్య, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
అనునిత్యం ప్రజల పక్షం
తెలుగు దిన పత్రిక
సోమవారం 2-2-2026



# ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలు



కీసర, ఫిబ్రవరి 01(తెలంగాణ ముచ్చట్లు) :తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసి, ప్రజల్లో చైతన్యం రగిలించిన ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతిని సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. పోరాట తత్వం, దిక్కర వ్యక్తిత్వం, కదం తొక్కిన కలం, అలుపెరుగని గళంతో అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన గద్దర్ సేవలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సైదులు మాట్లాడుతూ... గద్దర్ జీవితం మొత్తం ప్రజల పక్షానే సాగిందని, తెలంగాణ అస్తిత్వ పోరాటానికి ఆయన పాటలు, ప్రసంగాలు దిశానిర్దేశం చేశాయని అన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాదిగ జాగృతి మండల అధ్యక్షులు కొమ్ము రవి, ఎంఆర్పిఎస్ చీర్యాల గ్రామ అధ్యక్షులు బండారి నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి బోడ వెంకటేష్, యువనాయకులు బత్తుల రామచందర్, సందాని ఆనంద్, వార్డు సభ్యులు కనకయ్య, కీసర మండల మాజీ సంయుక్త కార్యదర్శి కంచమీది సంతోష్, కట్ట శంకరయ్య, కత్తి గణేష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏలూరి శ్రీనివాస్ ముదిరాజ్, బక్కని కుమార్--జె.కే తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఫర్నిచర్ విరాళం



ఏఎస్‌రావు నగర్, ఫిబ్రవరి 01 (తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్‌రావు నగర్ డివిజన్‌లో ఉన్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్ కుర్చీలు, టేబుళ్లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కేశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ, వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఫర్నిచర్‌ను అందజేశామని తెలిపారు. ఈ విరాళం ద్వారా సీనియర్ సిటిజన్లకు సౌకర్యం కలగడమే కాకుండా, అసోసియేషన్ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎ. అబ్రహాం, ఎ.వి. రెడ్డి మాట్లాడుతూ, వృద్ధుల పట్ల సామాజిక బాధ్యతతో ముందుకొచ్చే దాతల సేవలు అభినందనీయమని అన్నారు. సీనియర్ సిటిజన్లకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించడమే అసోసియేషన్ ప్రధాన లక్ష్యమని, ఈ ఫర్నిచర్ విరాళం ఆ దిశగా కీలక ముందడుగని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేశెట్టి ప్రసాద్‌కు అసోసియేషన్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నేపూరి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు అసోసియేషన్ కృషి చేస్తోందని తెలిపారు. వృద్ధులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఇలాంటి సేవలు ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజి రెడ్డి, పాకాల రాజన్న, ఆల్లురయ్య, మేఘ రాజు, రాష్ట్ర ఓబీసీ కన్వీనర్ మేధరి రామలింగం, ముదిగొండ లింగస్వామి, డివిజన్--2 ఎస్సీ సెల్ అధ్యక్షులు తాడూరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాఘ పౌర్ణమి సందర్భంగా హేమాద్రి వెంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ



కీసర, ఫిబ్రవరి 01(తెలంగాణ ముచ్చట్లు): కీసర మండలం లో రాంపల్లి దయారా వెంకులోని గుట్టపై వెలసిన శ్రీ హేమాద్రి వెంకటేశ్వర స్వామి వారికి మాఘ పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేయడం అత్యంత శుభప్రదమని, ఫలప్రదమని వేదోత్తములు ఆదిత్య శర్మ, ఆంజనేయ శర్మ, శ్రీనివాస్ శర్మ మార్గదర్శకత్వంలో నిర్ణయించిన శుభ ముహూర్తానికి గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించగా, హేమాద్రి వెంకటేశ్వర స్వామి సేవలో కీసర పోలీస్ స్టేషన్ సీఐ అర్కపల్లి ఆంజనేయులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా హేమాద్రి వెంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో మోస్తూ భక్తులు స్వామి నామస్మరణతో, భక్తి గీతాలు, భజన పాటలతో ఆడుతూ పాడుతూ గిరి ప్రదక్షిణ చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తున్న ధర్మదాతలు, రాంపల్లి దయారా గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని మరింత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ ఇకనుండి ప్రతి మాసంలో వచ్చే పౌర్ణమి రోజున ఉదయం 5 గంటలకు హేమాద్రి వెంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు కామసాని బాల్‌రెడ్డి, గరుగుల మల్లేష్, జాయింట్ సెక్రటరీ గాడి రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీ పురుషోత్తం రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు ద్యాగాల సుధాకర్, వరగంటి నగేష్, బిట్ల గంగ సముద్రం, చొక్కపురం శ్రీరాములు, గురుగుల బాలనర్సింహా, గోక బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



# నెలసరి పరిశుభ్రత మహిళల మౌలిక హక్కు

## -ఏడాది ముందే పార్లమెంట్‌లో స్పష్టంగా డిమాండ్ చేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

## -మహిళల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో కీలక తీర్పు వెలువడించిన సుప్రీం

వరంగల్,ఫిబ్రవరి01(తెలంగాణ ముచ్చట్లు): నెలసరి ఆరోగ్యం మహిళల ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు తాజాగా స్పష్టం చేసిన నేపథ్యంలో, ఈ అంశాన్ని ఏడాది క్రితమే పార్లమెంట్‌లో లేవనెత్తిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాత్ర మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు, విద్యాహక్కులో భాగంగా నెలసరి సమయంలో ఆరోగ్యంగా ఉండడం మహిళల మౌలిక హక్కేనని అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. గత ఏడాది పార్లమెంట్ సమావేశాల్లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య నెలసరి పరిశుభ్రత అంశంపై గళమెత్తారు. బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య, సామాజిక సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావిస్తూ, సమగ్ర విధానం అవసరమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో సరైన పారిశుధ్య సదుపాయాలు లేకపోవడం వల్ల అనేక మంది బాలికలు చదువుకు దూరమవుతున్నారని ఆమె అప్పుడే పార్లమెంట్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై తాజాగా సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, విద్యా సంస్థలు నెలసరి పరిశుభ్రతకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించాలని ఆదేశించింది. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు పర్యావరణ హితమైన శానిటరీ ప్యాడ్స్‌ను ఉచితంగా అందించడంతో పాటు, శుభ్రమైన టాయిలెట్లు, నీటి సదుపాయం, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది బాలికలు సరైన పారిశుధ్య సౌకర్యాలు లేకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పేద కుటుంబాలకు చెందిన బాలికలు నెలసరి సమయంలో తరచుగా విద్యకు దూరమవుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. నెలసరి పరిశుభ్రత కేవలం ఆరోగ్య అంశం మాత్రమే కాదని, అది మానవ హక్కులు, విద్య, లింగ సమానత్వంతో ముడిపడి ఉన్న సామాజిక అంశమని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సమగ్ర విధానాన్ని అమలు చేయాలని ఎంపీ కోరారు. మహిళా ఉద్యోగులకు కార్యాలయాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యమైన శానిటరీ ప్యాడ్స్‌ను ఉచితంగా అందించాలని తెలిపారు. ప్రతి విద్యా సంస్థలో శుభ్రమైన టాయిలెట్లు, నీటి సదుపాయం, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అలా జరిగితే బాలికలు నెలసరి సమయంలో భయం లేకుండా పాఠశాలలకు హాజరై, చదువులో రాణించడంతో పాటు



ఆరోగ్యంగా ఉండగలరని ఆమె అభిప్రాయపడ్డారు. గత పార్లమెంట్ సమావేశాల్లో మహిళల సౌకర్యాలు, భద్రతకు సంబంధించిన ప్రైవేట్ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఎంపీగా కూడా డాక్టర్ కడియం కావ్య గుర్తింపు పొందారు. ఉద్యోగ రంగంలో మహిళలకు నెలసరి సమయంలో అవసరమైన సదుపాయాలు, శుభ్రమైన రెస్ట్రూములు, ఆరోగ్య వసతులు చట్టపరంగా తప్పనిసరి చేయాలని ఆ బిల్లుల్లో ప్రతిపాదించారు. అలాగే నెలసరి సమయంలో మహిళలకు పెయిడ్ లీవ్, విద్యార్థినులకు సెలవు కల్పించాలన్న అంశాన్ని కూడా ఆమె బిల్లుల్లో చేర్చారు. మహిళల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన డాక్టర్ కడియం కావ్య, మహిళల హక్కుల పరిరక్షణ దిశగా ఇది కీలక ముందడుగు అని పేర్కొంటూ అత్యున్నత న్యాయస్థానానికి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలి

## -ముల్కనూర్ ఎస్ఐ రాజు



భీమదేవరపల్లి,ఫిబ్రవరి01(తెలంగాణ ముచ్చట్లు): భీమదేవరపల్లి మండలం కొప్పుర్ గ్రామంలో హనుమాన్ వారియర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ముల్కానుర్ ఎస్ఐ రాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఏదైనా ఒక క్రీడను ఎంచుకుని అందులో నైపుణ్యం సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువత క్రీడలపై దృష్టి పెట్టి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా జట్టు భావన, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చెప్పి, టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు గద్ద రఘు, మిరియాల రాజు పాల్గొన్నారు. అలాగే అంబాల చక్రపాణి, కొమ్ముల శ్రీను, గడిపే రాజేందర్, గడిపే అర్జున్, కాసగొని భరత్, గుడికందుల రంజిత్, గట్టు సాయి, కొమ్ముల సాగర్ తదితరులు హాజరయ్యారు.

# కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ అత్యవసర సమావేశం





హనుమకొండ,ఫిబ్రవరి1(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) అత్యవసర సమావేశం కాకతీయ హరిత హోటల్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సమావేశానికి టీఆర్టీఎఫ్ రాష్ట్ర చీఫ్ ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి అధ్యక్షత వహించారు. హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లునావత్ నరేందర్ నాయక్, ఉమ్మడి రాష్ట్ర సమన్వయ కన్వీనర్ దాక్షారపు విష్ణుమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు రాజబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్‌తో పాటు మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర బడ్జెట్ 2026--27పై చర్చ జరగగా, విద్యారంగ వేతన జీవుల ఆశలు ఈ బడ్జెట్‌లో నెరవేరలేదని సమావేశం అభిప్రాయపడింది. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు తగిన ప్రాధాన్యం లభించలేదని, గతంలో ప్రకటించిన పీఆర్సీ నివేదిక, డీఏలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బెనిఫిట్స్ అంశాలు పూర్తిగా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. పాఠశాల మౌలిక వసతులు, గుణాత్మక విద్య అమలు, ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు నియామకం, ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టుల మంజూరు, ఆట స్థలాల కల్పన వంటి అంశాలను తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని సమావేశం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆరవ తరగతి నుంచి మాత్రమే లాంగ్వేజ్ పండిట్ పోస్టులు ఉన్నాయని, మాతృభాషను సమర్థంగా బోధించాలంటే ప్రాథమిక స్థాయి నుంచే పండిట్ పోస్టులు అవసరమని సమావేశం అభిప్రాయపడింది. అందుకే ప్రాథమిక స్థాయి నుంచే లాంగ్వేజ్ పండిట్‌ల నియామకం తప్పనిసరిగా చేయాలని డిమాండ్ చేసింది. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలతో పాటు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా ప్రయోజనం చేకూరాలంటే విద్య, వైద్య రంగాలను కుల, మతాలకు అతీతంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సమావేశం పేర్కొంది. విద్య, వైద్య రంగాల పటిష్టత ద్వారానే రాజ్యాంగం కల్పించిన హక్కులను సార్థకంగా అమలు చేయగలమని అభిప్రాయపడింది. విద్యాశాఖ బాధ్యతలు ముఖ్యమంత్రి వద్దనే ఉన్న నేపథ్యంలో, ఈ అంశాలన్నింటినీ లోతుగా పరిశీలించి ప్రాథమిక స్థాయి నుంచే పండిట్ పోస్టులను మంజూరు చేస్తే పేద ప్రజలకు మేలు జరిగి, తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని టీఆర్టీఎఫ్ రాష్ట్ర శాఖ, 33 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శుల తరపున హనుమకొండ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ అంశంపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సంఘపక్షంగా ప్రభుత్వాన్ని కోరింది.

# సత్తుపల్లి మున్సిపాలిటీ బరిలో కూసంపూడి మాధురి మహేశ్ దంపతులు



సత్తుపల్లి,ఫిబ్రవరి01(తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున కూసంపూడి మాధురి, కూసంపూడి మహేశ్ దంపతులు ఎన్నికల బరిలో నిలిచారు. కూసంపూడి మాధురి 3వ వార్డు నుంచి, కూసంపూడి మహేశ్ 14వ వార్డు నుంచి అభ్యర్థులుగా పోటీ చేస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూసంపూడి మహేశ్ సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసి పట్టణ అభివృద్ధికి పలు చర్యలు చేపట్టినట్లు నాయకులు వెల్లడించారు. ఆయన పదవీకాలంలో రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, తాగునీటి సరఫరా మెరుగుదలతో పాటు పారిశుధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు పేర్కొన్నారు. అప్పట్లో ప్రారంభించిన అభివృద్ధి పనులను కొనసాగిస్తూ సత్తుపల్లిని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ఎన్నికల్లో దంపతులుగా ప్రజల ముందుకు వచ్చినట్లు తెలిపారు. ప్రజల సమస్యలపై పూర్తి అవగాహనతో మహిళలు, యువత సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని కూసంపూడి మాధురి చెప్పారు. ప్రతి వార్డులో సమగ్ర అభివృద్ధితో పాటు ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండే పాలన అందించడమే తమ లక్ష్యమని కూసంపూడి మహేశ్ తెలిపారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి కూసంపూడి మాధురి, కూసంపూడి మహేశ్‌లను గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలను కోరారు.

# మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులు రాజకీయ కక్షే

## -వేలేరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ జెండాలతో ధర్నా



వేలేరు,ఫిబ్రవరి01(తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్కు సిట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జెండాలతో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలేరు మండల బీఆర్ఎస్ ఇంచార్జ్ ఇట్టబోయిన భూపతి రాజ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా భూపతి రాజ్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి భయంతోనే బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా సిట్ నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షతో చేపట్టిన చర్యగా పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను భయపెట్టాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధిని ప్రజలు మరచిపోరని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలేరు గ్రామ కన్వీనర్ సూత్రము సంపత్, నాయకులు గోవింద, సురేష్, మాధవ రెడ్డి, చాడ విజేందర్ రెడ్డి, బుట్టి సురేష్ యాదవ్, ఎండీ జానీ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జోడుముంతల కిరణ్, బత్తుల శ్రీనివాస్, వెన్నం సంపత్ రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# పితృస్వామ్య రాజ్యంలో తమకంటూ ఓ సొంతిల్లు ఉండాలి

## -మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో రచయిత దియా విఘ్నేష్



**హైదరాబాద్,ఫిబ్రవరి01(తెలంగాణ ముచ్చట్లు):** మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఒగ్గు కథ – సాంస్కృతిక కార్యక్రమం" కార్యక్రమంలో రచయిత్రి దియా విఘ్నేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె...మహిళల అస్తిత్వం కోసం, ఈ పితృస్వామ్య రాజ్యం లో తమకంటూ ఓ సొంత్తిళ్ళు ఉండటం ఎంత అత్యవసరమో తెలియ జెప్పడం కోసం.. 'నాకో ఇల్లు కావాలి' కవితని వినిపించి, అనంతరం సాహిత్యం, సంస్కృతి ప్రాధాన్యతపై మాట్లాడారు. సమాజంలో సాహిత్యం పోషిస్తున్న పాత్ర, యువతలో సాహిత్యాభిరుచి పెంపొందించాల్సిన అవసరాన్ని ఆమె తన ప్రసంగంలో వివరించారు.దియా విఘ్నేష్ కవితలు శ్రోతలను ఆకట్టుకోవడంతో పాటు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆమె కవితల్లోని భావగర్భితమైన అంశాలు, సామాజిక స్పృహ ప్రేక్షకులను ఆలోచింపజేశాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు దియా విఘ్నేష్‌కు మెమొంటో అందించి సన్మానించారు. సాహిత్య రంగానికి ఆమె చేస్తున్న సేవలను కొనియాడుతూ, భవిష్యత్తులో మరిన్ని సాహిత్య కార్యక్రమాల్లో ఆమె భాగస్వామ్యం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.



# భివండిలో ఘనంగా కవి సమ్మేళనం, ఒగ్గుకథ సాంస్కృతిక కార్యక్రమం

## -మహారాష్ట్ర రాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహణ



**బీవండి,ఫీబ్రవరి 01(తెలంగాణ ముచ్చట్లు):** మహారాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో, మహారాష్ట్ర రాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ వేదికగా భివండిలో కవి సమ్మేళనం మరియు ఓగ్గుకథ సాంస్కృతిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష, సాహిత్యం, లోకసాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణ, అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి సాహిత్యాభిమానులు, కళాకారులు, వివిధ రంగాల ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత పద్మశాలి సంఘం, హైదరాబాద్ అధ్యక్షుడు కందగట్ల స్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన తన అధ్యక్ష ప్రసంగంలో తెలుగు భాషకు ఉన్న సమృద్ధమైన వారసత్వం, లోకకళల పరంపర, సాహిత్య ఉద్యమాల ప్రాధాన్యతను వివరించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా యువతలో మాతృభాష పట్ల అనుబంధం పెరుగుతుందని, సమాజంలో సాంస్కృతిక చైతన్యం మరింత బలపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమ తొలి భాగంలో ఓగ్గుకథ ప్రదర్శన జరిగింది. కర్ణాటకకు చెందిన సుప్రసిద్ధ కళాకారుడు కన్నెగొళ్ళ మల్లేశ్ తన బృందంతో కలిసి సంప్రదాయ ఓగ్గుకథను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ధార్మిక విశ్వాసాలు, నైతిక విలువలు, ప్రజాజీవితాన్ని ప్రతిబింబించే కథనాన్ని సంప్రదాయ వాయిద్య సంగీతం, అభినయం, కథనశైలితో ఆకట్టుకునేలా ప్రేక్షకుల ముందుంచారు. ఓగ్గుకథ ప్రదర్శన సభలో ప్రత్యేక ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించింది. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు, కవయిత్రులు పాల్గొని సామాజిక వాస్తవాలు, సాంస్కృతిక ఆవశ్యకతలు, మానవ విలువలు, సమకాలీన సమస్యలపై ఆధారిత కవితలను వినిపించారు. ఈ సమ్మేళనంలో బొట్టు శంకరయ్య, రవి ఇరవబిని, రామకృష్ణ పొడవల్లి, చింతకింది శంకర్, భేరి రామస్వామి, దివ్య విఘ్నేష్, సుదర్శన్ రామచంద్ర కుసుమ తదితరులు తమ కవితల ద్వారా తెలుగు సాహిత్యంలోని లోతైన భావజాలాన్ని ప్రభావవంతంగా ప్రతిబింబించారు. కవి సమ్మేళనాన్ని అశోక్ కాంటే సమర్థవంతంగా సమన్వయం చేస్తూ శ్రోతలతో చక్కటి సంభాషణ సాగించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో మహారాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ కార్యదర్శి డాక్టర్ కిరణ్ కులకర్ణి, మహారాష్ట్ర రాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ సంచాలకులు, సభ్య కార్యదర్శి సచిన్ నింబాల్కర్ మార్గదర్శకత్వం అందించారు. కార్యక్రమ సమన్వయకర్త హరీష్ ఇన్కన్ నేతృత్వంలో నిర్వహణ కమిటీ సమర్థంగా ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.తెలుగు భాష, సాహిత్యం, లోకసంస్కృతిని పరిరక్షించే దిశగా నిర్వహించిన ఈ కార్యక్రమం భివండిలో సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిందని పాల్గొన్న సాహిత్యప్రేమికులు అభిప్రాయపడ్డారు.

# భవనాల క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**-భవన యజమానులు నేరుగా లేదా**
**-టెక్నికల్ పర్సన్ (LTP) ద్వారా**
**- బిపిఎస్ పోర్టల్ దరఖాస్తు చేసుకునే అవకాశం.**
**- బిపిఎస్ పథకానికి ఆఖరు తేది 2026 మార్చి 11**
**-జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావు**



విశాఖపట్నం 01(తెలంగాణ ముచ్చట్లు): నగరంలో అనధికారికంగా , అనుమతి లేకుండా నిర్మించిన భవనాలకు , అనుమతి పొందిన విరుద్ధంగా నిర్మించిన భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం భవనాల క్రమబద్ధీకరణ పథకం--2025 (BPS--2025) ను G.O.Ms.No.225, MA&UD, తేదీ 12-11-2025 ద్వారా అమలులోకి తీసుకువచ్చిందని, ఈ అవకాశాన్ని భవన యజమానుదారులు వారి భవనాల క్రమబద్ధీకరణకు లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్స్ ద్వారా లేదా ఇప్పుడు ప్రత్యేకించి భవన యజమానుదారులు నేరుగా BPS పోర్టల్ (bps.ap.gov.in) ద్వారా దరఖాస్తు చేసుకునే సదవకాశాన్ని ఆఖరు తేదీ అయిన మార్చి 11 లోగా దరఖాస్తు చేసుకొని ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఏ ప్రభాకర్ రావు పత్రిక ప్రకటన ద్వారా శనివారం తెలిపారు. ఈ పథకం 01-01-1985 తర్వాత మరియు 31-08-2025కు ముందు నిర్మించబడిన భవనాలకు వర్తిస్తుందని, ఇది అన్ని మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర్ పంచాయతీలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోని గ్రామ పంచాయతీలు (APCRDA రాజధాని ప్రాంతం మినహా) మరియు ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (IALA) పరిధిలో అమలులో ఉంటుందన్నారు. అలాగే నగర ప్రజలు లైసెన్స్ పొందిన టెక్నికల్ పర్సన్ (ల్పూ) ద్వారా లేదా నేరుగా BPS పోర్టల్ (bps.ap.gov.in) ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. పెనాల్టీ రుసుము వివరాల కొరకు ఆన్లైన్ పోర్టల్‌లోని Charges Calculator ద్వారా గాని లేదా మీ సచివాలయ వార్డ్ ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీ (WPRS)ను సంప్రదించాలని ఆయన తెలిపారు. మీ యొక్క దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా కనీస రుసుము రూ.10,000/- చెల్లించి సమర్పించాలని, దరఖాస్తు సమర్పించు సమయంలో భవన ప్లాను వివరాలు అందుబాటులో లేనిచో తరువాత జతపరిచే వెసులుబాటు ఉందన్నారు. BPS--2025 లో దరఖాస్తు సమర్పించడానికి ఆఖరి తేదీ:11-03-2026. అర్హులైన భవన యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారని చీఫ్ సిటీ ప్లానర్ నగర ప్రజలకు తెలియజేశారు

# జీవీఎంసీలో 13 మంది ఉద్యోగుల ఉద్యోగ విరమణ.



విశాఖపట్నం 01(తెలంగాణ ముచ్చట్లు): మహా విశాఖపట్నం నగర పాలక సంస్థలో ఎంతో బాధ్యతగా సుదీర్ఘకాలం ఉద్యోగ విధులు నిర్వహించి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ పి ఎమ్.సత్యవేణి పేర్కొన్నారు. శనివారం ఆమె మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ లో వివిధ హోదాలలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులను జీవీఎంసీ అదనపు కమిషనర్ (రెవెన్యూ) డి.వి రమణమూర్తి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్. శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్. వి.నరేష్ కుమార్ లతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ పీఎం. సత్యవేణి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ కాలంలో తన కుటుంబము కంటే అధిక కాలాన్ని సంస్థ కొరకు పని చేశారని పేర్కొన్నారు. నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న రెవిన్యూ ఆఫీసర్ ఎం శ్రీకాంత్, పర్యవేక్షకులు ఇ.వి. శ్రీనివాసరావు, ఎం.మణిభూషణ్ రావు లతో పాటు వివిధ హోదాలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న మొత్తం 13 మంది ఉద్యోగ విరమణ పొందారని, వారందరి శేష జీవితాలు ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అలాగే రెవెన్యూ ఆఫీసర్ శ్రీకాంత్, పర్యవేక్షకుల శ్రీనివాసరావు, మణిభూషణరావు సేవలను గుర్తు చేస్తూ వారి అపారమైన అనుభవం జీవీఎంసీ కి ఎంతో అవసరమని, అవసరమైతే తోటి ఉద్యోగులకు వారి సూచనలు సలహాలు ఇవ్వాలని ఆమె కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# ఆరోగ్యం

## వేసవి తాపాన్ని తగ్గించే చియా సీడ్స్

నలుపు, తెలుపు రంగుల్లో మార్కెట్లో లభించే చియా సీడ్స్ వల్ల అధిక బరువు తగ్గే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. అధిక బరువుతో బాధపడేవారు చియా సీడ్స్‌ని ఆహారంలో భాగం చేసుకుంటే బరువు తగ్గుతారని పలు పరిశోధనలు వెల్లడించాయి. చియా సీడ్స్‌ని నేరుగా తీసుకోకూడదు. వాటిని నీటిలో నానబెట్టాలి. అలా నానబెట్టిన వాటిని పెరుగులోనూ, సలాడ్స్‌లోనూ వేసుకుని తీసుకోవచ్చు. నానబెట్టిన వాటిని ఒక గ్లాసు నీటిలో వేసుకుని అందులో కొద్దిగా నిమ్మరసం, ఉప్పు లేదా పంచదార, గ్యాస్ వాటర్‌ని పోసుకుని తీసుకోవచ్చు. చియా సీడ్స్ వల్ల బరువు మాత్రమే కాదు. వేసవి తాపం నుంచి కూడా ఉపశమనం పొందచ్చు. చియా సీడ్స్‌లో ప్రొటీన్లు, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిల్లో ఫైబర్ ఎక్కువగా ఉండడం వల్ల ఇవి



జీర్ణక్రియకు ఎంతో దోహదపడతాయి. మీ ఆరోగ్యాన్ని కాపాడడంలో ఎంతో సహాయపడతాయి.

## నేరేడు పండ్లు తిన్న వెంటనే ఇవి అస్సలు తీసుకోకూడదు..విషంతో సమానమే!



సమ్మర్ లో మామిడికాయలతో పాటుగా లభించే మరో ఆరోగయకరమైన పండు నేరుడుకాయ. దీనిని ఇండియన్ బ్లాక్ బెర్రీ అని కూడా పిలుస్తుంటారు. నేరేడు పండు.. తీపి,పులుపు, కొద్దిగా వగరు యరుచుల సమ్మేళనంతో ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తుంది. ఇది కేవలం రుచికి మాత్రమే కాకుండా అనేక ఔషధ గుణాలకు కూడా ప్రిసిద్ధి చెందింది. నేరేడు పండులో పొటాషియం, విటమిన్ సీ, మెగ్నీషియం, కాల్సియం, ఐరన్, ఫాస్పరస్ వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. కాబట్టి ఈ పండు తినడం ద్వారా మన ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది.

అయితే నేరేడు పండు తిన్న వెంటనే కొన్ని ఆహారపదార్థాల జోలికి వెళ్లకూడదు. నేరేడు పండు ఆరోగ్యానికి చాలా మంచిది అయినప్పటికీ కొన్ని ఆహార పదార్థాలను దానితో కలిపి లేదా తిన్న వెంటనే తీసుకోకూడదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అలా చేయడం వల్ల జీర్ణ సమస్యలు లేదా ఇతర అనారోగ్యాలు తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి నేరేడు పండు తిన్న వెంటనే తీసుకోకూడని ఆహారాలు ఏంటో ఇక్కడ చూడండి. పాలు,పాల ఉత్పత్తులు నేరేడు పండ్లు తిన్న వెంటనే పాలు,టీ వంటి అస్సలు తీసుకోకూడదు. నేరేడు పండులో ఉండే ఆమ్ల గుణాలు పాలతో కలిసినప్పుడు విరుద్ధంగా పనిచేస్తాయి. ఇది జీర్ణక్రియను నెమ్మదింపజేస్తుంది. .దీనివల్ల గ్యాస్, అజీర్ణం, మలబద్దకం,కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి నేరేడు పండు తిన్న తర్వాత కనీసం అరగంట నుండి ఒక గంట సమయం ఆగి పాలు లేదా పాల ఉత్పత్తులను తీసుకోవడం మంచిది. చాలామందికి తెలియని రహస్యం చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే నేరేడు పండు తిన్న వెంటనే నీళ్లు కూడా తాగకూడదు. నేరేడు పండ్లు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల జీర్ణవ్యవస్థపై ప్రభావం పడి విరేచనాలు లేదా అజీర్ణం వంటి సమస్యలు రావచ్చని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి నేరేడు పండు తిన్న తర్వాత 30 నుండి 40 నిమిషాల వరకు నీళ్లు తాగకుండా ఉండటం మంచిది.

## రోటీ,చపాతీల్లోకి అమోఘం..ధాభా స్టైల్ లో లసూని పాలక్ కర్రీ

లసూని పాలక్ కర్రీ అనేది భారతీయ వంటకాల్లో ఒక ప్రసిద్ధ వంటకం. ముఖ్యంగా నార్త్ ఇండయాలో ఇది చాలా ప్రాచుర్యం పొందింది. లసూని అంటే వెల్లుల్లి అని అర్థం,పాలక్ అంటే పాలకూర అని అర్థం. ఈ కర్రీలో వెల్లుల్లి రుచి డామినేట్ చేస్తుంది. పాలకూరతో కలిపి ఇది చాలా రుచికరంగా, పోషకభరితంగా ఉంటుంది. ఇది సాధారణంగా రోటీ, నాన్, పరాఠా లేదా అన్నంతో కలిపి తింటారు. ధాభా స్టైల్ లో లసూని పాలక్ ని మీ ఇంట్లోనే సులభంగా ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

లసూని పాలక్ కర్రీ తయారీకి కావాల్సిన పదార్థాలు –పాలకూర –వెల్లుల్లి –ఉల్లిపాయ –పచ్చిమిర్చి –అల్లంవెల్లుల్లి పేస్ట్ –నూనె/నెయ్యి –జీలకర్ర –ఇంగువ –పసుపు –కారం –ధనియాల పొడి –గరం మసాలా –ఉప్పు –వేయించిన జీలకర్ర పొడి

తయారీ విధానం –ముందుగా స్టవ్ మీద గిన్నె లేదా పెద్ద బౌల్ పెట్టి అందులో కొన్ని నీళ్లు పోసి అందులోనే కొద్దిగా ఉప్పు, 1 టీస్పూన్ చక్కెర,చిటికెడు వంట సోడా వేసి మరిగించాలి. –నీళ్లు మరిగిన తర్వాత అందులో రెండు కట్టల పాలకూరను కాడలతో సహా వేసుకోవాలి. ఇందులోనే 4 పచ్చిమిరపకాయలను కట్ చేయకుండానే వేసి 10 నిమిషాల పాటు ఉడకనివ్వాలి. –తర్వాత స్టవ్ ఆపి పాలకూరను తీసి చల్ల నీళ్లల్లో వేసి చల్లారిన తర్వాత దాన్ని మిక్సీ గిన్నెలో వేసి అందులోన కొన్ని నీళ్లు పోసి మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసుకోండి. –ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి అందులో పావు కప్పు ఆయిల్ పోసి వేడి చెయ్యాలి. ఆయిల్ వేడయ్యాక అందులో రెండు ఎండుమిర్చి ముక్కలు,అరటీస్పూన్ జీలకర్ర వేసి వేపండి. –జీలకర్ర చిట్లిన తర్వాత అందులో రెండు చిటికెళ్ల ఇంగువ వేసి వేపండి. తర్వాత ఇందులో 2 టేబుల్ స్పూన్ల



వెల్లుల్లి తరుగు వేసి లేత బంగారు రంగువచ్చే దాకా వేపుకోవాలి. –తర్వాత అందులో 1 ఉల్లిపాయ సన్నని తరుగు వేసి వేపుకోవాలి. ఉల్లి ఎరుపెక్కుతున్న సమయంలో అందులో 1 టేబుల్ స్పూన్ ఫ్రెష్ అల్లంవెల్లుల్లి పేస్ట్ వేపి వేపుకోవాలి. –తర్వాత అందులో 1 టేబుల్ స్పూన్ శెనగపిండి వేసిఓ పొంగు రానివ్వాలి. తర్వాత ఇందులో అరటేబుల్ స్పూన్ వేయించిన జీలకర్ర పొడి, అర టేబుల్ స్పూన్ ధనియా పొడి, పావు టీస్పూన్ పసుపు, రుచికి సరిపడా ఉప్పు, అర టేబుల్ స్పూన్ కారం వేసి వేయించుకోండి. –తర్వాత అందులో గ్రైండ్ చేసకున్న పాలక్ పేస్ట్ ని వేసి కలపాలి. –కావాలనుకుంటే ఇప్పుడు పాలక్ లో కొంచెం నీళ్లుపోసి అడ్జెస్ట్ చేసుకోవచ్చు. –పాలక్ లో నుంచి ఆయిల్ పైకి తేలేదాకా మధ్యమధ్యలో కలుపుతూ ఉడికించుకోవాలి. –ఆయిల్ పైకి తేలుతున్నప్పుడు అందులో కొద్దిగా గరం మసాలా, కొద్దిగా కొత్తిమీర తరుగు, 1 టేబుల్ స్పూన్ నలిపిన

తెలుగు వంటలు

# చరిత్ర సృష్టించిన అల్కరాజ్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను స్పెయిన్ యువ సంచలనం, టాప్‌సీడ్ కార్లోస్ అల్కరాజ్ చేజిక్కించుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో 22ఏళ్ల అల్కరాజ్.. సెర్బియాకు చెందిన 3వ సీడ్, నొవాక్ జకోవిచ్‌ను చిత్తు చేసి కెరీర్ గ్రాండ్‌స్లామ్‌తో చరిత్ర సృష్టించాడు. 22ఏళ్లకే ఈ మైలురాయికి అందుకొని కొత్త చరిత్ర లిఖించాడు. దీంతో 88 ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఉన్న రికార్డు బ్రద్దలైంది. టెన్నిస్‌లో కొత్త వారసుడిగా అవతరించిన కార్లోస్ అల్కారాస్ ఫైనల్లో.. కఠినమైన ప్రత్యర్థి నొవాక్ జకోవిచ్‌కు 25వ గ్రాండ్‌స్లామ్ కలను భగం చేస్తూ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో జయకేతనం ఎగురవేశాడు. ఉత్కంఠ పోరులో తొలి సెట్ కోల్పోయినా పట్టువదలని అల్కరాజ్ నాలుగు సెట్ల పోరులో జకోకు షాకిచ్చాడు. అనుభవజ్ఞుడైన జకోవిచ్‌పై పైచేయి సాధించిన అల్కరాజ్.. 2–6 6–2 6–3 7–5తో గెలుపొంది కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసుకున్నాడు. దాంతో.. ఓపెన్ ఎరాలో ఈ ఘనత సాధించిన ఆరో ఆటగాడిగా రికార్డు పుటల్లోకెక్కాడు. నంబర్ 1 ర్యాంకరైన అతడు 22ఏళ్ల 277 రోజుల్లో కెరీర్ గ్రాండ్‌స్లామ్ కలను నిజం చేసుకున్నాడు. దీంతో 1962లో రాడ్ లావెర్ 24ఏళ్ల 32 రోజులతో నెలకొల్పిన రికార్డు కనుమరుగైంది. పురుషుల టెన్నిస్ ఓపెన్ ఎరాలో అల్కరాస్ కంటే ముందు ఆరుగురు కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసుకున్నారు. రాడ్ లావెర్, ఆంద్రూ అగస్సీ, నొవాక్ జకోవిచ్ చెరొకసారి, రఫెల్ నాదల్ రెండుసార్లు ఈ ఘనత సాధించారు.

# సెమీస్‌కు యువ భారత్



బులవాయో: ఐసిసి అండర్–19 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లోకి భారత యువజట్టు ప్రవేశించింది. ఆదివారం జరిగిన నిర్ణయాత్మక మ్యాచ్‌లో భారతజట్టు 58 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తుచేసింది. ఈ మ్యాచ్‌లో ఒక్క బెర్త్ కోసం భారత్–పాకిస్తాన్ హోరాహోరీగా తలపడగా.. ఒకవేళ భారతజట్టును పాకిస్తాన్ ఓడించినా.. భారీ రన్‌రేట్‌ను సాధించాల్సి ఉంది. క్వీన్స్‌స్పోర్ట్స్ క్లబ్‌లో ఆదివారం జరిగిన చివరి సూపర్–6 మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు 49.5ఓవర్లలో 252పరుగులకు ఆలౌటైంది. త్రివేది(68) అర్ధసెంచరీకి తోడు కనిష్క్ చౌహాన్(35), వైభవ్ సూర్యవంశీ(30) బ్యాటింగ్‌లో రాణించారు. పాకిస్తాన్ బౌలర్లు అబ్దుల్ సుభాన్‌కు మూడు, మహ్మద్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో పాకిస్తాన్ జట్టు 46.2ఓవర్లలో 194పరుగులకే కుప్పకూలింది. ఉస్మాన్ ఖాన్(66) అర్ధసెంచరీ మినహా.. మిగిలిన ఏ ఒక్క బ్యాటరూ రాణించలేదు. ఆయుష్ మాత్రే, ఖిలాన్ పటేల్‌కు మూడేసి వికెట్లు, అంబరిష్, హేనిల్ పటేల్, చౌహాన్, మల్హోత్రాకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కనిష్క్ చౌహాన్‌కు దక్కింది. బుధవారం జరిగే రెండో సెమీఫైనల్లో భారతజట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడనుంది. మరో సెమీస్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య జరగనుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక



# సినిమా న్యూస్


# ట్రెండీ అవుట్ ఫిట్ లో మృణాల్ అందాలు..

## ఆ లుక్ చూసారా?



టాలీవుడ్‌లో 'సీతారామం'తో ప్రతి ఇంటి అమ్మాయిగా పేరు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్, ఇప్పుడు తన గ్లామర్ , స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. టాలీవుడ్‌లో 'సీతారామం'తో ప్రతి ఇంటి అమ్మాయిగా పేరు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్, ఇప్పుడు తన గ్లామర్ , స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. సంప్రదాయబద్ధమైన పాత్రల్లో ఎంతగా ఒదిగిపోతుందో, మోడ్రన్ బోల్డ్ లుక్స్‌లోనూ అంతే ధైర్యంగా తన బ్యూటీని ఎలివేట్ చేయగలగడం ఆమె ప్రత్యేకత. కేవలం నటనకే పరిమితం కాకుండా, ఫ్యాషన్ ఐకాన్‌గా మారుతూ యువతలో భారీ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. భాషతో సంబంధం లేకుండా తన ప్రతిభతో నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న ఈ భామ, ఫ్యాన్స్ మనసుల్లో చెరగని ముద్ర వేస్తోంది మోడ్రన్ లుక్‌లో వెలిగిపోతున్న మృణాల్: తాజాగా ఇన్స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్న ఫోటోల్లో మృణాల్ ఠాకూర్ సరికొత్త స్టైలిష్ మేకోవర్‌తో కనిపిస్తోంది. ఈ పిక్స్‌లో ఆమె ధరించిన మోడ్రన్ అవుట్‌ఫిట్ ఆమె పర్సనాలిటీకి పర్ఫెక్ట్‌గా సరిపోయింది. కెమెరా కళ్లకు తన చూపులతో మంత్రముగ్ధులను చేస్తూ, ఆమె ఇచ్చిన కాన్ఫిడెంట్ ఫోజులు ఫ్యాషన్ ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఆమె హెయిర్ స్టైల్, ఇయర్ రింగ్స్, సింపుల్ మేకప్ మరియు ఆ యాటిట్యూడ్ ఈ ఫోటోలకు ఒక వింటేజ్ క్లాసిక్ టచ్ ఇచ్చాయి. ఆధునికతను, క్లాస్‌ను మిక్స్ చేస్తూ మృణాల్ చేసిన ఈ ఫోటో షూట్ చూస్తుంటే, ఆమె కేవలం నటి మాత్రమే కాదు, ఒక పర్ఫెక్ట్ మోడల్ అని కూడా నిరూపిస్తోంది. సినిమా ప్రయాణం: కెరీర్ హిట్స్ , క్రేజీ ప్రాజెక్ట్స్ తో మృణాల్ కెరీర్ ప్రస్తుతం గోల్డెన్ ఫేజ్‌లో ఉంది. తెలుగులో 'సీతారామం', 'హాయ్ నాన్న' వంటి క్లాసిక్ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న ఈమె, గత ఏడాది తెలుగులో సినిమా లేకపోయినా బాలీవుడ్ లో సన్ ఆఫ్ సర్దార్ 2 మూవీతో అలరించింది. 2023 లో వచ్చిన హాయ్ నాన్న సినిమా సక్సెస్ తరువాత వరుసగా ఆమె నుండి మూవీస్ వస్తాయి అని అనుకున్నారు. అనుకున్నట్టు గానే విజయదేవరకొండ సరసన 2024లో ఫామిలీ స్టార్ వండి మూవీ లో నటించారు.కానీ సినిమా అంతగా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇక తెలుగులో ఆమె సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఆమె రాబోయే చిత్రాల విషయానికి వస్తే, తెలుగులో అడవి శేషు తో డెకాయిట్ మూవీలో నటిస్తున్నారు. ఇక బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ప్రభాస్ 'ఫౌజి' సినిమాలో ఆమె కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి, ఇది నిజమైతే టాలీవుడ్‌లో ఆమె క్రేజ్ ఆకాశాన్ని తాకడం ఖాయం. అలాగే హిందీలో వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను చాలా ప్లాన్డ్‌గా ముందుకు తీసుకెళ్తోంది. అందానికి కేవలం రూపమే కాదు, ఆత్మవిశ్వాసం కూడా తోడైతే ఎలా ఉంటుందో మృణాల్ ఠాకూర్‌ను చూస్తే అర్థమవుతుంది. అటు వెండితెరపై నటనతో, ఇటు సోషల్ మీడియాలో తన స్టైల్‌తో మృణాల్ చేస్తున్న హంగామా ఇప్పుడప్పుడే తగ్గేలా లేదు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప చిత్రాలతో ఆమె మనల్ని అలరించాలని కోరుకుందాం

# పల్లెటూరి అమ్మాయి పాత్రల్లో ఒదిగిన భామలు వీళ్లే!


తెలుగు తెరపై హీరోయిన్లు అంటే కేవలం గ్లామర్ తారలే కాదు, మట్టి వాసన ఉన్న పాత్రల్లోనూ ప్రాణం పోయగలరని మన ముద్దుగుమ్మలు నిరూపించారు. తెలుగు తెరపై హీరోయిన్లు అంటే కేవలం గ్లామర్ తారలే కాదు, మట్టి వాసన ఉన్న పాత్రల్లోనూ ప్రాణం పోయగలరని మన ముద్దుగుమ్మలు నిరూపించారు. 'ఫిదా'లో సాయి పల్లవి తెగువ, 'రంగస్థలం'లో సమంత మాస్ మేనరిజమ్స్ ప్రేక్షకులను ఇప్పటికీ మంత్రముగ్ధులను చేస్తూనే ఉన్నాయి. ఇప్పుడు అదే బాటలో 'జాతిరత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా 'భగవంతుడు' సినిమా కోసం పక్కా పల్లెటూరి పిల్లలా మారిపోయి అందరికీ షాక్ ఇచ్చింది. తన హైట్, మోడ్రన్ ఇమేజ్‌ను పక్కన పెట్టి ఆమె చేస్తున్న ఈ సరికొత్త ప్రయోగం ఇండస్ట్రీలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మరి పల్లెటూరి అమ్మాయి పాత్రల్లో ఒదిగిన భామల పైన ఓ లుక్ వేద్దాం.. గ్లామర్ కన్నా.. పల్లెటూరి పరిమళం మిన్న : తెలుగు సినిమాల్లో హీరోయిన్ అంటే అల్ట్రా మోడ్రన్ లేదా రిచ్‌గా ఉండాలనే రూల్ ఏమీ లేదు. కొన్నిసార్లు పచ్చని పొలాల మధ్య, లంగా ఓణి కట్టిన అమాయకత్వం కూడా బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుంది. 'ఫిదా'లో సాయి పల్లవి భానుమతి గా చూపించిన తెలంగాణ పల్లెటూరి తెగువ, 'రంగస్థలం'లో రామలక్ష్మిగా సమంత పండించిన మాస్ పల్లెటూరి హావభావాలు ప్రేక్షకులకు ఇప్పటికీ గుర్తే. దేవర మూవీలో జాన్వీ కపూర్ మొదటిసారి తెలుగు మూవీ చేస్తూ గ్లామర్ కన్నా పల్లెటూరు మిన్న అన్నట్టు ఫుల్ మూవీ అంతా అదే పాత్రలో కొనసాగింది. ఇక అప్పట్లో వచ్చిన 'చందమామ'లో కాజల్, 'మిర్చి'లో అనుష్క, 'కరెంట్ తీగ'లో రకుల్, 'అ ఆ'లో అనుపమ.. ఇలా ప్రతి ఒక్కరూ తమ గ్లామర్ ఇమేజ్‌ని పక్కన పెట్టి మట్టి వాసన కలిగిన పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నారు. ఈ పాత్రలే వారి కెరీర్‌కు మైలురాళ్లుగా నిలిచాయి. జక్కన్న అసలు ప్లాన్ అదేనా? చిట్టి ఇక పల్లెటూరి గుమ్మ: 'జాతి రత్నాలు' సినిమాతో చిట్టిగా అందరి మనసు దోచుకున్న ఫరియా అబ్దుల్లా, ఇప్పుడు 'భగవంతుడు' చిత్రంతో సరికొత్త ప్రయోగానికి సిద్ధమైంది. తాజాగా విడుదలైన టీజర్‌లో ఆమె లుక్ నెటిజన్లను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎత్తుగా ఉండే ఫరియా, పల్లెటూరి లంగా ఓణిలో ఎంతో ఒద్దికగా కనిపిస్తూనే, మరోవైపు తనదైన శైలిలో రొమాంటిక్ సీన్స్‌లో గ్లామర్ టచ్ కూడా ఇచ్చింది. సాధారణంగా పల్లెటూరి పాత్రలు అంటే కొంత రిస్క్ అని భావిస్తారు, కానీ సాయి పల్లవి, సమంతల మాదిరిగానే ఫరియా కూడా ఈ సినిమాతో తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించి సక్సెస్ బాట పడుతుందని టీజర్ చూస్తే అర్థమవుతోంది.ాశ్రీంశీ =ఘ్రుం – కోలీవుడ్ స్టార్‌తో మ్యాడ్ డైరెక్టర్ మంతనాలు.. హీరోయిన్లు పల్లెటూరి పాత్రలు చేయడం వల్ల వారిలోని నటనా సామర్థ్యం బయటపడటమే కాకుండా, మాస్ ఆడియన్స్‌కు మరింత దగ్గరయ్యే అవకాశం ఉంటుంది. 'భగవంతుడు' సినిమాలో ఫరియా చేస్తున్న ఈ పల్లెటూరి ప్రయత్నం తప్పకుండా ఆమెకు మంచి బ్రేక్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటేనే ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలం రాణించవచ్చని భావించి, ఇప్పుడు ఫరియా కూడా అదే బాటలో నడుస్తోంది. మరి ఈ 'పల్లెటూరి భామ' బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు మేపిస్తుందో చూడాలంటే సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే..

# ల్యాండ్ మార్క్ మూవీ..

# టాలీవుడ్ కింగ్ 'టార్గెట్' అదేనా?



టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున సోలో హీరోగా సిల్వర్ స్క్రీన్ పై కనిపించి చాలా కాలమే అయింది. రీసెంట్ గా వచ్చిన కూలీ, కుబేర వంటి చిత్రాల్లో నెగెటివ్ షేడ్స్ లేదా సైడ్ క్యారెక్టర్స్ కే పరిమితమైన నాగ్ నుంచి ఓ సాలిడ్ కమర్షియల్ మూవీ రావాలని అభిమానులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఆ వేచి చూసే రోజులకు ఎండ్ కార్డ్ పడినట్టే కనిపిస్తుంది. కెరీర్ లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ సినిమాను నాగార్జున సైలెంట్ గా సెట్స్ పైకి తీసుకెళ్లారు. కోలీవుడ్ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై స్వయంగా నాగార్జున గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. గతేడాది ఎలాంటి హడావుడి లేకుండా పూజా కార్యక్రమాలు నిర్వహించిన మేకర్స్, అప్పటి నుంచి సీక్రెట్ గా షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు పోస్టర్ గానీ, కాన్సెప్ట్ వీడియో గానీ విడుదల చేయకపోవడం విశేషం. ప్రస్తుతం హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. టాకీ పార్ట్ దాదాపు పూర్తి దశకు చేరుకున్నట్టు సమాచారం. షూటింగ్ పూర్తయ్యే వరకు కూడా సీక్రెట్ గా ఉంచాలన్నది నాగార్జున ప్లాన్. అందుకే మేకర్స్ ఎలాంటి అప్‌డేట్స్ ఇవ్వడం లేదు. అయితే సమ్మర్ చివరికి చిత్రీకరణ పూర్తి చేసి, దసరా టార్గెట్ గా గ్రాండ్ రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. సరైన సమయానికి రిలీజ్ డేట్ ప్రకటించేలా నాగ్ ప్లాన్ చేసుకుంటున్నారు. టైటిల్ కూడా అప్పుడే అనౌన్స్ చేయనున్నారని సమాచారం. అయితే లాటరీ కింగ్ అనే టైటిల్ ను కూడా పరిశీలిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రావాల్సి ఉంది. అదే సమయంలో చిత్రంలో నాగార్జునకు జోడీగా టబు నటించనున్నట్టు ఇటీవల ఆయన కన్ఫర్మ్ చేశారు. వీరిద్దరి మధ్య రొమాంటిక్ యాంగిల్ కూడా ఉండనున్నట్లు సమాచారం. నాట్యం ఫేమ్ సుస్మితా భట్ మరో హీరోయిన్ గా ఎంపికైనట్టు ప్రచారం సాగుతోంది. కథ ఆధారంగా నాగ్ మూడు వేర్వేరు గెటప్స్‌లో కనిపిస్తారని, మొత్తం ముగ్గురు హీరోయిన్లు ఉంటారని టాక్. జోనర్ విషయానికి వస్తే యాక్షన్, ఎమోషన్స్ ఉన్న కథతో సినిమా రూపొందుతోందట. ఈసారి గ్రాఫిక్స్, వీఎఫ్ఎక్స్ లకు దూరంగా రియలిస్టిక్ యాక్షన్ సన్నివేశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలుస్తోంది. ప్రేక్షకులు నిజమైన స్టంట్స్ ను ఇష్టపడుతున్నారని భావించిన నాగ్, అదే స్టైల్ లో మూవీ ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇప్పటివరకు వచ్చిన సినిమాల్లా కాకుండా డిఫరెంట్ కాన్సెప్ట్ తో సంథింగ్ స్పెషల్ గా కింగ్ 100 ఉండబోతుందని వినికిడి.

# ఓం రౌత్.. టాలీవుడ్ హీరోతో ఆ సీక్రెట్ మీటింగ్ దేనికోసం?

బాలీవుడ్ డైరెక్టర్ ఓం రౌత్ పేరు వినగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది 'ఆదిపురుష్'. ఆ సినిమా తర్వాత సౌత్ లో ముఖ్యంగా టాలీవుడ్ ఆడియన్స్ నుండి ఆయన ఏ రేంజ్ లో ట్రోలింగ్ ఎదుర్కొన్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు బాలీవుడ్ డైరెక్టర్ ఓం రౌత్ పేరు వినగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది 'ఆదిపురుష్'. ఆ సినిమా తర్వాత సౌత్ లో ముఖ్యంగా టాలీవుడ్ ఆడియన్స్ నుండి ఆయన ఏ రేంజ్ లో ట్రోలింగ్ ఎదుర్కొన్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. విజువల్స్ విషయంలో వచ్చిన నెగటివిటీ వల్ల ఓం రౌత్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది.



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151."PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,"CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in